శనివారం 21-09-2024

# ముందడుగు

దినపత్రిక

సంపుటి: 1, సంచిక: 462 పేజీలు: 4 | ₹6

EPAPER.MUNDADUGU.COM

SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD | KARIMNAGAR | WARANGAL | JAGITYAL | KHAMMAM | NALGONDA | MAHABOOBNAGAR | NIZAMABAD

మీ ప్రాంతంలో జరిగే ఏలాంటి సమస్య ఐనా ముందడుగు దృష్టికి తీసుకురండి.. సమస్య పరిష్కారానికి ప్రయత్నం చేద్దాం. మీ ప్రాంతంలో మీరు ముందడుగు పౌర పాత్రికేయుడిగా పనిచెయొచ్చు.. మీ సమస్యలపై స్పందించండి..

Mundadugu whatsapp:
9491114616

email: mundadugu111@gmail.com

## తెలంగాణలో రుణమాఫీ చేయని కాంగ్రెస్

### గణపతి ఉత్సవాలను కూడా వ్యతిరేకిస్తోంది

### ఇప్పుడున్నది గతంలోని కాంగ్రెస్ కాదు

### మహారాష్ట్రలోని వార్ధా కార్యక్రమంలో నరేంద్రమోడీ

ముందడుగు జాతీయం:



అర్బన్ నక్సల్స్, తుక్డే తుక్డే గ్యాంగ్ కాంగ్రెస్‌ను నడిపిస్తోందని, ఇప్పుడున్నది గతంలోని కాంగ్రెస్ కాదని, ఆ పార్టీలో దేశభక్తి, స్ఫూర్తి పూర్తిగా తుడిచిపెట్టుకుపోయాయని ప్రధాని నరేంద్రమోడీ అన్నారు. మహారాష్ట్రలోని వార్ధాలో జరిగిన కార్యక్రమంలో నరేంద్రమోడీ మాట్లాడుతూ కాంగ్రెస్ అంటేనే అబద్ధం, మోసం, నిజాయతీ లేకపోవడం అని విమర్శించారు. తెలంగాణలో రుణమాఫీ చేస్తామని ఆ పార్టీ హామీ ఇచ్చి రైతుల నుంచి తప్పించుకొని తిరుగుతోందని మండిపడ్డారు. గణపతి ఉత్సవాలను కూడా ఆ పార్టీ వ్యతిరేకిస్తోందని మోడీ పునరుద్ఘాటించారు.

"నేటి కాంగ్రెస్ గణపతి పూజను కూడా అసహ్యించుకుంటోంది. స్వాతంత్ర్య పోరాట సమయంలో లోకమాన్య బాల గంగాధర్ తిలక్ నాయకత్వంలో దేశ ఐక్యతను పెంచడానికి గణపతి ఉత్సవాన్ని ఏర్పాటు చేశారు. ఇందులో అన్ని ప్రాంతాల, వర్గాల ప్రజలు కలిసి పాల్గొంటారు. కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం వినాయకుడి విగ్రహాన్ని పోలీసు జీపులో ఎక్కించి, అవమానించిన ఘటన మీ అందరికీ తెలుసు. ప్రజలు పూజించిన దేవుని విగ్రహాన్ని పోలీసు వ్యాన్‌లో బంధించారు. ఈ విషయంపై కాంగ్రెస్ మిత్రపక్షాలు కూడా మౌనంగా ఉండడం నాకు ఆశ్చర్యం కలిగిస్తోంది. కాబట్టి మనమంతా ఏకమై కాంగ్రెస్ చేస్తున్న పాపాలకు తగిన బుద్ధి చెప్పాలి" అని మోడీ అన్నారు.



## 2026 వరకు నక్సలిజం తుడిచిపెట్టుకుపోతుంది

### హింసను వీడి మావోయిస్టులు లొంగిపోవాలి

### కేంద్ర హోంమంత్రి అమిత్ షా

ముందడుగు జాతీయం:

2026 మార్చి నాటికి దేశంలో నక్సలిజం తుడిచిపెట్టుకుపోతుందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా పేర్కొన్నారు. హింసను వీడి లొంగిపోవాలని మావోయిస్టులకు విజ్ఞప్తి చేశారు. ఛత్తీస్‌గఢ్‌లో నక్సల్స్ హింసాకాండలో 55 మంది బాధితులను ఉద్దేశించి ఆయన శుక్రవారం ఈమేరకు వ్యాఖ్యానించారు. దేశంలో మావోయిస్టుల హింస, భావజాలాన్ని నిర్మూలించి శాంతిని నెలకొల్పాలని ప్రధాని నరేంద్ర మోదీ నిర్ణయించుకున్నారని అమిత్‌షా పేర్కొన్నారు. మావోయిస్టులు ఒకప్పుడు పశుపతినాథ్ (నేపాల్) నుంచి తిరుపతి వరకు కారిడార్ ఏర్పాటుచేయాలని భావించారని కానీ, మోదీ నేతృత్వంలో దాన్ని ధ్వంసం మిగతా 2లో



అంతరిక్షంలోనే సునీతా విలియమ్స్ బర్త్‌డే వేడుకలు మిగతా 2లో



భారత్‌లో తొలి హైస్పీడ్ రైలుకు రంగం సిద్ధం మిగతా 3లో



ఇజ్రాయెల్‌పై 140 రాకెట్లతో హెజ్‌బొల్లా దాడి మిగతా 3లో



60 శాతం భారతీయుల్లో క్యాన్సర్ భయం మిగతా 5లో

## తిరుమల లడ్డుపై నివేదిక ఇవ్వండి

### చంద్రబాబును కోరిన కేంద్ర ఆరోగ్యమంత్రి నడ్డా

ముందడుగు జాతీయం:




ఆంధ్రప్రదేశ్ తిరుమల తిరుపతి శ్రీవారి మహా ప్రసాదం లడ్డూ తయారీకి వినియోగించే నెయ్యిలో జంతువుల కొవ్వులు కలిపినట్లు వచ్చిన ఆరోపణలను కేంద్ర ప్రభుత్వం తీవ్రంగా పరిగణించింది. తాజాగా కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి జేపీ నడ్డా దీనిపై స్పందించారు. ఈ మొత్తం వ్యవహారంపై సమగ్ర నివేదికను ఇవ్వాలని ఆయన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి మిగతా 2లో

## సింగరేణి కార్మికులకు తెలంగాణ ప్రభుత్వం బోనస్

### ఏడాదిలో సింగరేణికి రూ.4,701 కోట్లు లాభం

ముందడుగు తెలంగాణ:



తెలంగాణ సింగరేణి కార్మికులకు ప్రభుత్వం శుభవార్త చెప్పింది. 2023 24 ఏడాదిలో సింగరేణికి రూ.4,701 కోట్లు లాభం వచ్చిందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. ఇందులో సింగరేణి కార్మికులకు రూ.796 కోట్లు మిగతా 2లో

ముందడుగు
శనివారం, 21-09-2024, హైదరాబాద్

# 2026 వరకు నక్సలిజం తుడిచిపెట్టుకుపోతుంది

మొదటిపేజీ తరువాయి:

చేశామన్నారు. ఈసందర్భంగా హింసను, ఆయుధాలను వదిలేసి లొంగిపోవాలని విజ్ఞప్తి చేశారు. లేకుంటే మావోయిస్టుల అంతానికి ఆల్ అవుట్ ఆపరేషన్ నిర్వహించాల్సి వస్తుందని హెచ్చరించారు. ఛత్తీస్‌గఢ్‌లోని నాలుగు జిల్లాల్లో మావోయిస్టులకు వ్యతిరేకంగా జరిపిన ఆపరేషన్లలో భద్రతా బలగాలు గణనీయమైన విజయాన్ని సాధించారన్నారు.

# కర్ణాటక హైకోర్టు జడ్జిపై సుప్రీంకోర్టు ఆగ్రహం

## మహిళా న్యాయవాదిపై జడ్జి వివాదాస్పద వ్యాఖ్యలు..

ముందడుగు జాతీయం:



ఓ భూ వ్యవహారానికి సంబంధించిన కేసులో హైకోర్టు జడ్జి జస్టిస్ వేదవ్యాసాచార్ శ్రీశానంద విచారణ చేపట్టారు. ఆ ప్రాంతాన్ని పాకిస్థాన్‌తో పోలుస్తూ వివాదాస్పద వ్యాఖ్యలు చేయడమే కాక, ఈ కేసును వాదించిన మహిళా న్యాయవాది పైనా తీవ్ర అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారు. సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారడంతో ఈ వ్యవహారం సుప్రీంకోర్టు దృష్టికి వెళ్లింది. కోర్టుల్లో న్యాయమూర్తులు చేసే వ్యాఖ్యలపై స్పష్టమైన మార్గదర్శకాలు విడుదల చేయాల్సిన అవసరాన్ని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ఐదుగురు న్యాయమూర్తుల ధర్మాసనం వ్యక్తంచేసింది. కోర్టు కార్యకలాపాలను పర్యవేక్షించడంలో సోషల్ మీడియా చురుకైన పాత్ర పోషిస్తున్నప్పుడు.. న్యాయస్థానాల వ్యాఖ్యానాలు చట్టాలకనుగుణంగా మర్యాదపూర్వకంగా ఉండేలా చూడాల్సిన అవసరం ఉందని ధర్మాసనం పేర్కొంది. "కేసు విచారణ సందర్భంగా కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి చేసిన వ్యాఖ్యలపై మీడియాలో వచ్చిన వార్తలపై దృష్టిసారించాం. దీనిపై కర్ణాటక హైకోర్టు నుంచి నివేదిక అడిగాం" అని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ పేర్కొన్నారు. ఈ విషయంలో తాము కొన్ని ప్రాథమిక మార్గదర్శకాలను నిర్దేశించవచ్చని చెప్పారు. ఓ భూవ్యవహారంలో యజమాని అద్దెదారు మధ్య వివాదానికి సంబంధించిన కేసులో కర్ణాటక హైకోర్టు జడ్జి జస్టిస్ వేదవ్యాసాచార్ శ్రీశానంద చేసిన వ్యాఖ్యలకు సంబంధించిన వీడియో ఇటీవల సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది. ఇక ఈ కేసులో మహిళా న్యాయవాదికి ప్రత్యర్థి వర్గం గురించి చాలా తెలుసని అనిపిస్తోందంటూ.. ఆమెపై జడ్జి అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారు.

# తిరుమల లడ్డుపై నివేదిక ఇవ్వండి

మొదటిపేజీ తరువాయి:

చంద్రబాబు నాయుడును కోరారు. ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో నడ్డా మాట్లాడుతూ "నేను ఆయనతో (సీఎం చంద్రబాబు) మాట్లాడాను. వారి వద్ద ఉన్న సమాచారాన్ని పంపించమని చెప్పాను. కేంద్రం ఈ విషయంలో రాష్ట్రానికి పూర్తిగా సహకరిస్తుంది. ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఎస్ఏఐ) నిబంధనలకు అనుగుణంగా చర్యలు తీసుకొంటాం. ఇప్పటికి నివేదికే కోరాం" అని తెలిపారు.

తిరుమల ప్రసాదంలో కల్తీపై మరో కేంద్ర మంత్రి బండి సంజయ్ కూడా స్పందించారు. ఇది ఏమాత్రం క్షమించరాని నేరమని ఆయన అభివర్ణించారు. అదే సమయంలో ఈ వ్యవహారంలో మత కోణం ఉంటుందనే అనుమానం వ్యక్తం చేశారు. బోర్డులో అన్యమతస్తుల కారణంగానే కల్తీ నెయ్యి సరఫరా అయిందన్నారు.

# సింగరేణి కార్మికులకు తెలంగాణ ప్రభుత్వం బోనస్

మొదటిపేజీ తరువాయి:

బోనస్‌గా ప్రకటిస్తున్నట్టు చెప్పారు. సగటున ఒక్కో కార్మికుడికి రూ. 1.90లక్షలు బోనస్ వస్తుందన్నారు. సింగరేణి కార్మికులకు సంతోషంగా బోనస్ ప్రకటిస్తున్నట్టు భట్టి విక్రమార్క తెలిపారు. ఒప్పంద ఉద్యోగులకు కూడా ఒక్కొక్కరికి రూ. 5వేల చొప్పున ఇవ్వాలని నిర్ణయించినట్టు చెప్పారు. సింగరేణి లాభాల్లో 33 శాతం బోనస్‌గా ప్రకటించడం పట్ల కార్మికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గతేడాది కంటే రూ. 20వేలు అదనంగా బోనస్ ప్రకటించామని, సింగరేణి చరిత్రలో తొలిసారిగా ఒప్పంద ఉద్యోగులకూ బోనస్ ఇస్తున్నామని ప్రభుత్వం తెలిపింది.

# అంతరిక్షంలోనే సునీతా విలియమ్స్ బర్త్‌డే వేడుకలు

ముందడుగు జాతీయం:



భారత సంతతి వ్యోమగామి సునీతా విలియమ్స్ సాంకేతిక కారణాల వల్ల రోజుల తరబడి అక్కడే చిక్కుకుపోయిన సంగతి తెలిసిందే. కాగా సెప్టెంబర్ 19న సునీత పుట్టినరోజు. ఈ సందర్భంగా తన 59వ బర్త్‌డేను ఆమె భూమికి 400 కిలోమీటర్ల ఎత్తులో ఉన్న అంతరిక్ష కేంద్రంలో నిర్వహించుకున్నారు.

పుట్టినరోజున ఆమె బిజీ షెడ్యూల్ గడిపారు. తనతోటి వ్యోమగామి విల్‌మోర్‌తో కలిసి స్పేస్ స్టేషన్ లైఫ్ సపోర్ట్ సిస్టమ్‌లను శుభ్రం చేసుకున్నారు. స్మోక్‌డిటెక్టర్ల పనితీరును పరీక్షించారు. ఇదంతా రొటీన్ పనే అయినప్పటికీ.. ఐఎస్ఎస్‌లో ఉన్నవారి ఆరోగ్యం, భద్రతకు చాలా కీలకమని వ్యోమగాములు చెబుతారు. అనంతరం వారు హ్యూస్టన్‌లోని మిషన్ కంట్రోల్ సెంటర్‌లోని డైరెక్టర్లతో జరిగిన సమావేశంలో పాల్గొన్నారు. ఈ చర్చల్లో భాగంగా వ్యోమగాముల లక్ష్యాలు, చేయాల్సిన పనులు, వివిధ శాస్త్రీయ అధ్యయనాల గురించి మాట్లాడారు. కాగా.. అంతరిక్షంలో బర్త్‌డే చేసుకోవడం ఆమెకు ఇది రెండోసారి. గతంలో 2012లోనూ ఆమె తన పుట్టినరోజున మిషన్‌లో భాగంగా ఐఎస్ఎస్‌లోనే ఉన్నారు.

# 22 రకాల స్టెరాయిడ్స్ సీజ్

ముందడుగు తెలంగాణ:



దేహదారుఢ్యం కోసం వినియోగించే స్టెరాయిండ్స్‌ను అనుమతి లేకుండా విక్రయిస్తున్న ఓ దుకాణంపై డీసీఏ అధికారులు దాడులు జరిపారు. రూ. 2 లక్షల విలువ చేసే 22 రకాల స్టెరాయిడ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్టేషన్ డైరెక్టర్ జనరల్ వీబీ కమలాసన్‌రెడ్డి కథనం ప్రకారం...నగరానికి చెందిన రాకేశ్ కొండియా కోఠి ఈసామియాబజార్‌లో 'రాకేశ్ డిస్ట్రిబ్యూటర్స్'పేరుతో దేహదారుఢ్యానికి సంబంధించిన పలు రకాల ఉత్పత్తులను విక్రయిస్తున్నాడు. డీసీఏ అనుమతులు లేకుండా 22 రకాల స్టెరాయిడ్స్ ఔషధాలను జిమ్ సెంటర్లకు సరఫరా చేస్తున్నాడు. డీసీఏ అధికారులు శుక్రవారం సదరు దుకాణంపై దాడులు జరిపి, స్టెరాయిడ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. శేరిలింగంపల్లి ప్రాంతానికి చెందిన డాక్టర్ బోయిని శ్రీకాంత్‌యాదవ్ మియాపూర్‌లోని ఆర్‌బీఆర్ కాంప్లెక్స్‌లో 'శ్రీకాంత్ న్యూరో సెంటర్' పేరుతో హాస్పిటల్‌ను నిర్వహిస్తున్నాడు. అదే దవాఖానలో డీసీఏ అనుమతి లేకుండానే నిబంధనలకు విరుద్ధంగా మెడికల్ షాపును సైతం నిర్వహిస్తున్నాడు.

ముందడుగు
శనివారం, 21-09-2024, హైదరాబాద్

### ఇజ్రాయెల్‌పై 140 రాకెట్లతో

# హెజ్‌బొల్లా దాడి

### పలు మిలటరీ బ్యారెక్స్‌పై దాడులు



ముందడుగు జాతీయం:

ఇజ్రాయెల్‌పై హెజ్‌బొల్లా ప్రతి దాడికి దిగింది. ఆ దేశంపైకి తాజాగా 140 రాకెట్లు ప్రయోగించింది. ఇజ్రాయెల్ హద్దుమీరిందని, ప్రతి దాడి ఉంటుందంటూ హెజ్‌బొల్లా అధినేత హసన్ నస్రల్లా పేర్కొన్న వేళ ఈ రాకెట్లు ప్రయోగించడం గమనార్హం. ఉత్తర ఇజ్రాయెల్‌లోని పలు మిలటరీ బ్యారెక్స్‌పై ఈ దాడులు జరిపినట్లు హెజ్‌బొల్లా పేర్కొంది. దక్షిణ లెబనాన్‌లోని ఇజ్రాయెల్ జరిపిన దాడికి ప్రతిగా రాకెట్లతో దాడులకు పాల్పడినట్లు తెలిపింది. లెబనాన్ సరిహద్దుల నుంచి మూడు దఫాలుగా రాకెట్లు దూసుకొచ్చిన విషయాన్ని ఇజ్రాయెల్ మిలటరీ సైతం ధ్రువీకరించింది. నష్టం వివరాలు మాత్రం తెలియరాలేదు.

నిన్న మొన్నటివరకు పాలస్తీనాలోని హమాస్‌పై దృష్టి పెట్టిన ఇజ్రాయెల్.. ఇప్పుడు హెజ్‌బొల్లాను లక్ష్యంగా చేసుకుంది. ఈ క్రమంలోనే ఇటీవల పేజర్లు, వాకీటాకీల పేలుళ్లతో లెబనాన్ అట్టుడికిన సంగతి తెలిసిందే. ఈ పేలుళ్ల వెనుక ఇజ్రాయెల్ కుట్ర ఉందనేది హెజ్‌బొల్లా వాదన. ఈ క్రమంలోనే దక్షిణ లెబనాన్‌పై గురువారం ఇజ్రాయెల్ వైమానిక దాడులతో విరుచుకుపడగా.. నేడు హెజ్‌బొల్లా ప్రతీకార దాడికి దిగడం గమనార్హం.

### భారత్‌లో తొలి హైస్పీడ్ రైలుకు

# రంగం సిద్ధం

### బెంగుళూరులో తయారీకి టెండర్ విడుదల

ముందడుగు బెంగుళూరు:



మొదటిసారిగా భారత్‌లో తొలి హైస్పీడ్ రైలు తయారీకి బెంగళూరులో రంగం సిద్ధమైంది. ముంబయిఅహ్మదాబాద్ రైలు కారిడార్‌లో దీనిని వినియోగించనున్నారు. ఇప్పటికే ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీ సెప్టెంబర్ 5వ తేదీన హైస్పీడ్ ఛైర్‌కార్ ట్రెయిన్ తయారీకి సంబంధించిన టెండర్‌ను విడుదల చేసింది. గంటకు 280 కిలోమీటర్ల వేగంగా వెళ్లే సామర్థ్యంతో వీటిని నిర్మించాలన్నారు. దీని బిడ్ల దాఖలకు సెప్టెంబర్ 19తో గడువు ముగిసింది. దీనికి బీఈఎంఎల్ మాత్రమే కొటేషన్ దాఖలు చేసింది. దీనిపై ఐసీఎఫ్ జనరల్ మేనేజర్ యు.సుబ్బారావ్ విలేకర్లతో మాట్లాడుతూ త్వరలోనే టెండర్ ప్రక్రియ ముగుస్తుందన్నారు. ఇక బీఈఎంఎల్ కేంద్రంలో తయారుకానున్న ఈ రైలుకు రెండున్నరేళ్ల గడువు ఉంటుంది. రైలు అసలు ధరను మాత్రం ఇప్పటివరకు బహిర్గతం చేయకపోయినా.. దాదాపు రూ.200250 కోట్ల మధ్యలో ఉండొచ్చని భావిస్తున్నారు. ముంబయిఅహ్మదాబాద్ మధ్య దాదాపు 508 కిలోమీటర్ల మార్గంలో సిద్ధమైన హైస్పీడ్ కారిడార్‌లో వినియోగించనున్నారు. దీనిని దాదాపు రూ.1.1 లక్షల కోట్లతో నిర్మించనున్నారు. వాస్తవంగా జపాన్‌లో తయారుచేసిన రైళ్లను ఈ మార్గంలో నడపాలని తొలుత భావించారు. కానీ, నిర్మాణవ్యయం భారీగా ఉండటంతో దేశీయంగా తాజాగా నిర్ణయించారు. ఈ ప్రాజెక్టు కోసం బీఈఎంఎల్, మేధా సెర్వో డ్రైవ్స్ కలిసి పని చేయనున్నట్లు తెలుస్తోంది. ఐరోపా ప్రమాణాలకు అనుగుణంగా ఈ సరికొత్త రైలు సిద్ధం కానుంది. మేధా హైస్పీడ్ ప్రొపెల్షన్ వ్యవస్థలను తయారుచేస్తుంది. ఇప్పటికే వందేభారత్ రైళ్లలో ఈ టెక్నాలజీని వినియోగిస్తున్నారు.

### ఉద్యోగుల సమస్యలపై

# దృష్టి సారించండి

### సిఎం రేవంత్ రెడ్డికి నాల్గో తరగతి ఉద్యోగుల సంఘం విజ్ఞప్తి

ముందడుగు తెలంగాణ:



తెలంగాణ ఉద్యోగుల సమస్యలపై దృష్టిసారించి వాటిని పరిష్కరించాలని తెలంగాణ నాలుగవ తరగతి ఉద్యోగుల కేంద్ర సంఘం.. రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఏపీలో పని చేస్తున్న తెలంగాణ ఉద్యోగులను స్వరాష్ట్రానికి తీసుకువచ్చే విషయంపై శుక్రవారం సాయంత్రం జరిగే మంత్రివర్గ సమావేశంలో చర్చించాలని సీఎం రేవంత్ రెడ్డిని కోరింది. పదేళ్లకుపైగా ఏపీలో పలు ఇబ్బందులు ఎదుర్కొంటూ పనిచేస్తున్న 100 మంది నాలుగవ తరగతి ఉద్యోగులను ఇక్కడికి తీసుకొచ్చేందుకు సీఎం చొరవ చూపాలని సంఘం ప్రధాన కార్యదర్శి కందూరి గంగాధర్ కోరారు. హైదరాబాద్ నాంపల్లిలోని సంఘం కార్యాలయంలో జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఇది ఉద్యోగుల ఫ్రెండ్లీ ప్రభుత్వమని, ఒకటో తేదీనే ఉద్యోగులకు వేతనాలు ఇచ్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. రాష్ట్ర పునర్నిర్మాణంలో తాము కూడా భాగస్వాములమయ్యామన్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాల నేపథ్యంలో సీఎం సహాయనిధికి ఒకరోజు వేతనాలను అందజేసినట్లు తెలిపారు. పెండింగ్‌లో ఉన్న తమ ఉద్యోగుల డీఏలను విడుదల చేయడంతో పాటు ఇతర డిమాండ్లను పరిష్కరించాలని గంగాధర్ కోరారు.

### 90ఏళ్ల వృద్ధురాలిపై

# ముగ్గురు యువకులు అత్యాచారం

### మేడ్చల్ జిల్లాలో దారుణ సంఘటన

ముందడుగు క్రైం:



పసిపిల్లల నుంచి పండు ముసలి వరకు అత్యాచారాలు జరుగుతూనే ఉన్నాయి. ఏ వయసువారినీ వదిలిపెట్టకుండా లైంగిక దాడులు చేస్తూ.. జుగుప్స కలిగేలా చేస్తున్నారు. అలాంటి ఘటనే.. మేడ్చల్ జిల్లాలో చోటుచేసుకుంది. మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని.. బండమాదారం గ్రామంలో ఓ వృద్ధురాలిపై ముగ్గురు యువకులు అత్యాచారం చేసిన ఘటన వెలుగులోకి వచ్చింది. బండమాదారంలోని క్వార్టర్స్‌లో 90 ఏళ్ల వయసున్న ఓ వృద్ధురాలు నివసిస్తోంది. అయితే.. కామంతో కళ్లు మాత్రమే కాదు బుద్ధి కూడా భ్రష్టు పట్టి పోయిన.. అదే గ్రామానికి చెందిన ముగ్గురు యువకులు.. ఒంటరిగా ఉంటున్న వృద్ధురాలిపై లైంగిక దాడికి తెగబడ్డారు. అయితే.. అందులో ఒకరిని స్థానికులు పట్టుకుని దేహశుద్ధి చేశారు. స్థానికులకు దొరికిన వ్యక్తి.. కరెంట్ లైన్ వద్ద సహాయకుడిగా పనిచేసే వెంకట్ రావు(36)గా గుర్తించగా.. మరో ఇద్దరు యువకులు పారిపోయినట్టు తెలిపారు. ఈ విషయాన్ని వెంటనే పోలీసులకు తెలపటంతో.. హుటాహుటిన ఘటనా స్థలికి చేరుకుని.. పరీక్షల నిమిత్తం వృద్ధురాలిను గాంధీ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని.. విచారణ చేస్తున్నారు. స్థానికులు పట్టుకున్న వ్యక్తిని అదుపులోకి తీసుకోవటంతో పాటు.. పారిపోయిన మిగతా ఇద్దరి కోసం గాలిస్తున్నారు.

ముందడుగు
శనివారం, 21-09-2024, హైదరాబాద్

### కిమ్స్‌లో 300 ఫుల్లీ ఆటోమేటెడ్ రోబోటిక్

# మోకాలి మార్పిడి శస్త్రచికిత్సలు



**ముందడుగు హైదరాబాద్:**

కొండాపూర్‌లోని కిమ్స్ ఆస్పత్రిలోని అడ్వాన్స్‌డ్ రోబోటిక్ సెంటర్ (ఏఆర్‌సీ)లో విజయవంతంగా 300 ఫుల్లీ ఆటోమేటెడ్ రోబోటిక్ మోకాలి మార్పిడి శస్త్రచికిత్సలు పూర్తిచేశారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు రెండింటిలో మొట్టమొదటిసారిగా ఏర్పాటుచేసిన ఈ ఏఆర్‌సీలో శస్త్రచికిత్సల ద్వారా రోగులకు సత్ఫలితాలు రావడం, తక్కువ సమయంలో కోలుకోవడంలో సరికొత్త ప్రమాణాలను నెలకొల్పినట్లయింది. కొరియాకు చెందిన అత్యాధునిక క్యువిస్ జాయింట్ రోబోటిక్ సిస్టమ్ సాయంతో మోకాలి ఆస్టియో ఆర్థరైటిస్ లాంటి సమస్యలతో ఇబ్బందిపడే రోగులకు అద్భుతంగా శస్త్రచికిత్స చేయడానికి వీలుంటుంది. హైదరాబాద్‌లో ఫస్ట్ ఫుల్లీ ఆటోమేటెడ్ రోబోటిక్ సిస్టమ్ కావడం విశేషం. కిమ్స్ ఆస్పత్రుల సీఎండీ డాక్టర్ బొల్లినేని భాస్కర్‌రావు, సీఈఓ డాక్టర్ అభినయ్ బొల్లినేని దూరదృష్టితోనే ఇన్ని విజయాలు సాధ్యమైనట్లు ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో కొండాపూర్ కిమ్స్ ఆస్పత్రికి చెందిన చీఫ్ కన్సల్టెంట్ ఆర్థోపెడిక్, జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జన్ డాక్టర్ అన్నే సాయిలక్ష్మణ్ తెలిపారు.

### ఫ్యాషన్ రంగంలో

# మిమ్మల్ని మీరు విశ్వసించండి

## ఎన్ఐఎఫ్డీ గ్లోబల్ సంస్థలో ఫెమినా మిస్ ఇండియా విజేతలు

**ందడుగు హైదరాబాద్:**



ఫ్యాషన్, డిజైన్ విద్య రంగంలో తమకంటూ ఒక ప్రత్యేకమైన గుర్తింపు సాధించిన ప్రముఖ సంస్థ ఎన్ఐఎఫ్డీ గ్లోబల్ తన విద్యార్థులతో ప్రత్యేక ఇంటరాక్టివ్ సెషన్ కోసం ఫెమినా మిస్ ఇండియా తెలంగాణ 2024 ప్రకృతి కంభం, ఫెమినా మిస్ ఇండియా ఆంధ్రప్రదేశ్ 2024 భవ్య రెడ్డిలు హజరయ్యారు. ఫెమినా మిస్ ఇండియా 2024 రాష్ట్ర విజేతలు ఫ్యాషన్, అందం మరియు జీవనశైలి పరిశ్రమలపై వారి అమూల్యమైన, స్ఫూర్తిదాయకమైన ప్రయాణాలను పంచుకున్నారు. ఎన్ఐఎఫ్డీ గ్లోబల్ చేస్తున్న వినూత్న విధానాన్ని మరియు డిజైన్ విద్యలో నిబద్ధతను ప్రశంసించారు.

ఫెమినా మిస్ ఇండియా తెలంగాణ 2024 ప్రకృతి కంభం విద్యార్థులతో ప్రేరణాత్మక సందేశాన్ని పంచుకున్నారు: "మిమ్మల్ని మీరు విశ్వసించండి, పెద్దగా కలలు కనండి మరియు కష్టపడి పని చేయండి. అభిరుచి మరియు అంకితభావంతో, మీరు అనుకున్నది ఏదైనా సాధించవచ్చు అని తెలిపారు. ఫెమినా మిస్ ఇండియా ఆంధ్రప్రదేశ్ 2024 భవ్యరెడ్డి మాట్లాడుతూ "విద్యార్థులు మీ ఆశయాన్ని, మీ ప్రకాశాన్ని మసకబారనివ్వవద్దు. మీ వ్యక్తిత్వాన్ని స్వీకరించండి మరియు మీ ప్రత్యేక ప్రతిభను ప్రకాశింపజేయండి అని సూచించారు. ఎన్ఐఎఫ్డీ గ్లోబల్ సెంటర్ డైరెక్టర్ సంజయ్ సరస్వత్ మాట్లాడుతూ "ఫెమీనా మిస్ ఇండియా 2024 రాష్ట్ర విజేతలు మా క్యాంపస్‌ను సందర్శించడం మా విద్యార్థులకు నిజంగా స్ఫూర్తిదాయకమైన అనుభవం అన్నారు.

# పని ఒత్తిడితోనే సిఏ యువతి మృతి

## అంత్యక్రియలకు హజరుకాని ఉద్యోగులు.. సీరియస్‌గా తీసుకున్న కేంద్ర కార్మిక శాఖ

**ముందడుగు మహారాష్ట్ర:**



కార్పోరేట్ కంపెనీలలో రేయింబవళ్లు పనిచేస్తూ, పని ఒత్తిడి భరించలేక చాలా మంది ఉద్యోగులు.. ఉద్యోగానికి రాజీనామా చేయడమో లేక రాత్రింబవళ్లు నిద్ర, ఆహారం లేకుండా పనిచేస్తూ ఉంటారు. ఈ క్రమంలోనే తాజాగా ఓ 26 ఏళ్ల సీఏ ఉద్యోగిని పని ఒత్తిడికి తాళలేక చనిపోవడం తీవ్ర సంచలనం సృష్టిస్తోంది. ఆమె చనిపోయిన తర్వాత కనీసం చూడడానికి కూడా సదరు కంపెనీ నుంచి ఒక్క ఉద్యోగి కూడా రాకపోవడం గమనార్హం. ఈ ఘటన తీవ్ర దుమారానికి కారణం కావడంతో స్పందించిన కేంద్రం సీరియస్ అయింది.

ఎర్నెస్ట్ అండ్ యంగ్ ఇండియా పూణే బ్రాంచ్‌లో పనిచేసే కేరళకు చెందిన యువ ఛార్టర్డ్ అకౌంటెంట్ 26 ఏళ్ల అన్నా సెబాస్టియన్ పెరియాలి ఇటీవలె మృతి చెందారు. తన కుమార్తె.. ఎర్నెస్ట్ అండ్ యంగ్ ఇండియా కంపెనీలో పని ఒత్తిడి తట్టుకోలేక అనారోగ్యానికి గురై చనిపోయిందని ఆమె తల్లి అనితా అగస్టీన్ ఆరోపించారు. తన కుమార్తె చాలా రోజులు ఆఫీస్‌లోనే విపరీతంగా పని చేసేదని.. కొన్నిసార్లు నిద్రపోయేందుకు టైం సరిపోయేది కాదని వాపోయారు. అర్ధరాత్రి వరకు, వీకెండ్స్ కూడా అన్నా సెబాస్టియన్ ఆఫీస్‌లోనే ఉండి పనిచేసేదని తెలిపారు. అదనపు భారం వేయడంతో.. పూర్తిగా అలసిపోయి ఇంటికి వచ్చి కనీసం దుస్తులు కూడా మార్చుకోకుండానే పడుకునేందని వెల్లడించారు. ఎర్నెస్ట్ అండ్ యంగ్ ఇండియా కంపెనీలో పని ఒత్తిడి కారణంగానే తన కుమార్తె చనిపోవడానికి కారణం అని అనిత తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ వ్యవహారం తీవ్ర దుమారం రేపుతోంది. సోషల్ మీడియాలో నెటిజన్లు తీవ్ర స్థాయిలో మండిపడుతున్నారు. ఈ ఘటన సంచలనంగా మారడంతో కేంద్రం స్పందించింది. అన్నా సెబాస్టియన్ మరణాన్ని సీరియస్‌గా తీసుకున్న కేంద్ర కార్మిక శాఖ.. దీనిపై దర్యాప్తు చేపడుతుందని కేంద్ర సహాయమంత్రి శోభా వెల్లడించారు.

### మెగాస్టార్ చిరంజీవికి అక్కినేని జాతీయ అవార్డు..


### ప్రకటించిన అక్కినేని నాగార్జున

**ముందడుగు హైదరాబాద్:**



మెగాస్టార్ చిరంజీవికి అక్కినేని జాతీయ అవార్డుకు ఎంపికయ్యారు. అక్టోబర్ 28న అవార్డు ప్రదాన కార్యక్రమం జరుగనున్నది. ఈ కార్యక్రమానికి ప్రముఖ బాలీవుడ్ నటుడు అమితాబ్ బచ్చన్ ముఖ్య అతిథిగా హాజరై చిరంజీవికి అవార్డును అందజేయనున్నారు. ఈ విషయాన్ని నటుడు అక్కినేని నాగార్జున ప్రకటించారు. శుక్రవారం అక్కినేని నాగేశ్వరరావు శత జయంతి సందర్భంగా హైదరాబాద్‌లో వేడుకలు నిర్వహించారు. ఆర్కే సినీ ప్లెక్స్‌లో ఏఎన్నార్ శత జయంతి వేడుకలు జరిగాయి. కార్యక్రమానికి నాగార్జునతో పాటు కుటుంబ సభ్యులు, ప్రముఖ దర్శకుడు రాఘవేంద్ర రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా నాగార్జున మాట్లాడుతూ తన తండ్రి నాగేశ్వరరావు నవ్వుతూ జీవించడం నేర్పించారన్నారు. ఈ వారాంతంలో ఫిల్మ్ ఫెస్టివల్ జరుగుతోందని.. అన్నపూర్ణ స్టూడియోలో అభిమానులు రక్తదానం చేశారన్నారు. అభిమానుల ఆదరణ మా కుటుంబం ఎప్పుడూ మరిచిపోదన్నారు. రెండేళ్లకోసారి ఏఎన్నాఆర్ అవార్డులు ఇస్తున్నామని.. ఈ సారి చిరంజీవికి ఇవ్వాలని నిర్ణయించుకున్నామన్నారు. అక్టోబర్ 28న అవార్డు ప్రదాన కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. అక్కినేని శత జయంతి సందర్భంగా మెగాస్టార్ చిరంజీవి ఆయనను స్మరించుకున్నారు. ఆల్ టైమ్ గ్రేట్ నటుల్లో ఒకరైన నాగేశ్వరరావుని ఆయన శత జయంతి రోజున స్మరించుకుందామన్నారు.

ముందడుగు
శనివారం, 21-09-2024, హైదరాబాద్



# 60 శాతం భారతీయుల్లో క్యాన్సర్ భయం

ముందడుగు ఆరోగ్యం: భారతదేశంలో క్యాన్సర్ వ్యాధి అత్యంత భయంకరంగా మారింది. ఆ వ్యాధి పేరు వింటేనే జనం భయంతో వణికిపోతుంటారు. క్యాన్సర్ వ్యాధిపై ఇటీవల GOQii సర్వేలో దాదాపు 60% మంది భారతీయులు క్యాన్సర్ గురించి నిరంతరం ఆందోళన చెందుతున్నారని వెల్లడించింది. ఇది కేవలం భావోద్వేగ సమస్య కాదు. ఇది ప్రజల జీవనశైలి ఎంపికలు, మానసిక ఆరోగ్యం, మూల్యాంకనం చేయడానికి ఇష్టపడే వాటిని కూడా ప్రభావితం చేస్తుంది.

## పెరుగుతున్న క్యాన్సర్ ఆందోళనలు

చాలా మంది భారతీయులు క్యాన్సర్ భయంతో బాధపడుతున్నారని సర్వే వెల్లడించింది. ఈ నిరంతర, ఎప్పుడూ ఉండే భయం అన్ని వయసుల, లింగాల. సామాజిక ఆర్థిక నేపథ్యాల ప్రజలను ప్రభావితం చేస్తుంది. ప్రజలు క్యాన్సర్‌కు భయపడతారు . దానితో వచ్చే మరణం, ఆర్థిక ఇబ్బందులు , జీవనశైలి మార్పుల గురించి ఎక్కువగా భయపడతారు. ఈ సర్వేలో పాల్గొన్న వారిలో దాదాపు 24% మంది క్యాన్సర్‌తో చనిపోతామనే భయాన్ని వ్యక్తం చేశారు. మరో 33% మంది తమ కుటుంబానికి చికిత్స ఖర్చుపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు.

## తీవ్రమవుతున్న మానసిక భయం

అన్ని వేళలా భయపడుతూ ఉండటం మానసిక అలసటకు కారణమవుతుంది. క్యాన్సర్ ముప్ప ఫలితంగా చాలా మంది తీవ్ర ఆందోళన , ఒత్తిడిని అనుభవిస్తారు. ఇది నిరాశ, విచారం, ఏకాగ్రత కష్టం , నిద్రలేమి వంటి ఇతర సమస్యలుగా వ్యక్తమవుతుంది. వ్యాధుల భయంతో సాధారణ జీవితం గడపడం కష్టం. ఇది వారి సంబంధాలు, పని సాధారణ మానసిక ఆరోగ్యంపై భారీ ప్రభావాన్ని చూపుతుంది

## అవగాహన కల్పించినా నివారణ చర్యలు లేవు

సర్వేలో పాల్గొన్న వారిలో 70% మంది క్యాన్సర్ గురించి తెలిసినప్పటికీ, గత ఐదేళ్లలో తమకు ఎలాంటి స్క్రీనింగ్ రాలేదని చెప్పారు. సమర్థవంతమైన చికిత్స కోసం ముందస్తుగా గుర్తించడం ఎంతో ముఖ్యం. ప్రజలు తమ శరీరాలను పరీక్షించుకోవడానికి వెనుకాడడానికి అనేక కారణాలు ఉన్నాయి. ప్రధానంగా ఆరోగ్య వ్యవస్థపై అపనమ్మకం , ఏదైనా వ్యాధులకు సంబంధించిన వార్తలు వినడానికి భయం చాలామందిలో నెలకొంది. భారతదేశంలో క్యాన్సర్ చికిత్స ఖర్చు చాలా ఎక్కువ. చాలా కుటుంబాలు భరించలేని స్థితిలో ఉన్నాయి. చాలా మందికి, వైద్య సంరక్షణ, శస్త్రచికిత్స, కీమోథెరపీ , ప్రిస్క్రిప్షన్ మందుల ఖర్చులు భరించలేనంతగా ఉన్నాయి. ఈ సర్వేలో, 33% మంది పాల్గొనేవారిలో క్యాన్సర్ నిర్ధారణను అనుసరించే ఖర్చులు అనేవి ఎక్కువగా ఉన్నాయని పేర్కొన్నారు.